# మనసే మనిషికి శాపమా?

కాంచన ప్రవర్తన కొరడాతో కొట్టినట్టనిపించింది గంగకి! మతి చలించినట్టనిపించింది! అవమానం, ఆవేశం దుఃఖం ముంచుకొచ్చాయి పోటీపడి! మంచం మీద వాలి దిండులో తలపెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది గంగ.

"ఊరుకో! ఎందుకేడుస్తావ్? ఇదెప్పుడూ ప్రపంచంలో ఉండేదేగా! కొత్తేముంది?" ఓదారుస్తూ అన్నాడు మల్లిక్.

"ఇలా జరుగుతుందని కల్లోకూడా అనుకోలేదు - ముఖ్యంగా నాకు! నేను....నేను....ఎవరికోసం నా జీవితంలో సగం ధారపోశాను? ఎందుకోసం నన్ను నేను మరచి వాళ్ళకోసం బతుకుతూ వచ్చాను? ఇప్పుడు....ఇప్పుడు...." దుఃఖం ముంచుకొస్తుంటే మరి మాట్లాడలేకపోయింది గంగ.

మల్లిక్ సిగరెట్ వెలిగించి ఆమె పక్కనే కూర్చున్నాడు. "పిచ్చిదానా! అయితే ఏదో ఆశించి చేశావా, చేసిందంతా?"

"ఏమాశించాన్నేను? డబ్బా? వస్తువులా? నేనాశించిందల్లా ఒక్కటే, నామీద అభిమానం! నేను కోరిన ప్రతిఫలం నామీద గౌరవం! ఇది అన్యాయమా?"

"నిజంగా నువ్వు అమాయకురాలిని గంగా! ఇంత చదువుకున్నావ్! ప్రపంచాన్ని కాచి వడపోశావ్! కాని ఒక్కటి తెలుసుకోలేకపోయావ్! ప్రేమా, అభిమానం, న్యాయం, ఇవి జీవితంలో పూర్తిగా లభించవు. పైగా పుస్తకాల్లో

రాసినంత తియ్యగా కనిపించవు. అలా కనిపించాలనుకోవడం పొరపాటు!" లాలనగా తలనిమురుతూ అన్నాడు మల్లిక్.

దుఃఖం కట్టలు తెంచుకు ప్రవహిస్తోంది గంగకి ఆపడానికి చేసే ప్రయత్నం విఫలమై పోతోంది. గతం సినిమా రీళ్ళలా కళ్ళముందు మెదిలింది. ఏడ్చి ఏడ్చి వెక్కిళ్ళొచ్చాయి. మల్లిక్ తల్లిని పిలిచి మంచినీళ్ళు తెమ్మన్నాడు.

"ఏమిటి గంగా ఇదంతా! బంగారం లాంటి మొగుడూ, రత్నాల్లాంటి బిడ్డలూ హాయిగా లక్షణంగా వుండక ఎందుకమ్మా ఈ గొడవ ఒక స్టేజొచ్చాక, తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ అంటూ పెద్దగా పట్టించుకోకూడదు అంటే ప్రేమ వుండ కూడదనికాదు. కానీ, ప్రేమ చూపించే విధానంలో మార్పు రావాలి!" అంది సుగుణమ్మ మంచినీళ్ళ గ్లాసందిస్తూ.

సుగుణమ్మ, కమలాకర్రావు గార్లకు మల్లిక్ ఒక్కడే కొడుకు పెద్ద ఆస్తిపాస్తులు లేకపోయినా. తండ్రి కొడుకు లిద్దరికీ ఉద్యోగాలున్నాయి. కమలాకర్రావుగారు రైల్వేలో ఉద్యోగంచేసి రిటైరయ్యారు. మల్లిక్‌కి ఆర్.టి.సి. పి.ఆర్.వో. ఉద్యోగం సుగుణమ్మకి కోడలైనా, కూతురైనా గంగే! గంగంటే ఆవిడకి చాలా ఇష్టం.

మంచినీళ్ళు తాగి గ్లాసు పక్కన పెడుతూ, "అత్తయ్యా. నేను అందరి ఆడపిల్లల్లాగా పెరిగానా? అందరూ తల్లి తండ్రుల చాటున ఆకుమాటున పిందెల్లా పెరుగుతారు. కానీ నేను? బుద్ధి తెలిసీ తెలియని వయస్సులో తలకు మించిన భారాన్ని నెత్తిన వేసుకుని, కుటుంబ పోషణ బాధ్యత వహించాను. నన్ను నేను సంరక్షించుకుంటూ, వాళ్ళని ఒక మార్గంలో పెట్టడానికి సమా జంతో పోరాడాను. నా చదువుకి స్వస్తిచెప్పి వారిని చదివించాను. నేను పెళ్ళి మానుకుంటే, వాళ్ళు మానుకునే పరిస్థితి ఏర్పడుతుందేమోనని నన్ను కోరు కున్న ఇంటికి కోడలినయ్యాను. ఇప్పుడు చెప్పండి. నేను అందరిలా ఎలా అవుతాను?" వలవలా ఏడ్చింది గంగా.

"గంగా! 'అడ్డాలనాడు బిడ్డలుగానీ, గడ్డాలొచ్చాక బిడ్డలా?' అనే సామెత తల్లిదండ్రులకే వర్తించినప్పుడు, తోబుట్టువులకు వర్తించదూ? నీకు తెలీకకాదు. నీ మనసలాంటిది. అది ఇతరులు గ్రహించడం లేదని నీ బాధ. చూడు గంగా! నువ్వు చేసిందొక గొప్పపనని వాళ్ళనుకోవద్దూ?" మంచం మీద కూర్చుని ఓదార్పుతో అంది సుగుణమ్మ.

''అమ్మకైనా తెలీదా?''

"అమ్మ అలా అనుకోకపోవచ్చు. ప్రతి సమస్యనీ రెండు వైపుల నుంచీ పరిశీలించాలి. ఆమె బహుశ నువ్వు చదువు మానేసి ఉద్యోగం చెయ్యడం, వాళ్ళందరి కోసమేకాదు, నువ్వు హాయిగా స్వతంత్రంగా బతకడం కోసమేనని అనుకుందనుకో! అప్పుడు ఆమె దృష్టిలో, నువ్వనుకున్న త్యాగం కనబడక పోవచ్చు. అలాగే మిగిలినవాళ్ళు కూడా! ఇల్లు సరిగ్గా వుండాలంటే ఆ వ్యవస్థ ఒకళ్ళ చేతిమీదుగా నడవాలి. సంపాదనవల్ల ఆ అర్హత నీకు తెలీకుండా నువ్వే పొందావు. మిగిలిన వారిని ఒక మార్గంలో నడిపించడానికి అధికారాన్నీ నువ్వే పొందావు. అది వారి మంచికోసమే కావొచ్చు. కానీ, రానురాను ఈ విషయంలో ఇతరులకి ఈర్ష్య కలగొచ్చు. లేదా తనేమిటి మనకి చెప్పేది అనే ఏహ్యభావం కలగొచ్చు."

ఆమె చెప్తున్న ప్రతీ మాటా జాగ్రత్తగా వింది గంగ. ఆమె తెలివి తేటలకీ, పరిశీలనా శక్తికి ఆశ్చర్యపోయింది. మంచినీళ్ళగ్లాసు తీసుకుని ఆమె లోపలి కెళ్ళిపోయింది. గంగ మనసు గతంలోకి జారిపోయింది.

* * *

అప్పుడే నిజాం కాలేజీలో ఎమ్.ఏ. మొదటి సంవత్సరంలో చేరింది. ఎకనామిక్స్‌లో చాలా తక్కువ మందికి సీటొచ్చింది ఆ సంవత్సరంలో. అందరూ అభినందించారు. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయింది తను. కానీ ఆ సంతోషం అట్టేసేపు నిలవలేదు. సినిమా తియ్యడం కోసం నాన్నగారు కొందరితో చేతులు కలిపి, ఇల్లు, వాకిలీ, వెండీ, బంగారం మొత్తం తాకట్టు పెట్టారు. హఠాత్తుగా అతను గుండెపోటుతో మరణించడం వల్ల చిటికలో ఆ ఇంట్లో పరిస్థితి తలకిందులైంది. తనే ఇంటికి పెద్దదవడం వల్ల కుటుంబ భారాన్ని తనమీదే వేసుకుంది. ఇల్లువాకిలీ అమ్మేశాక అప్పులు పోను ఆ ఇంట్లో మిగిలింది తల్లి జానకమ్మ, పెద్ద తమ్ముడు రామ్, రెండోవాడు లక్ష్మణ్, సులోచనా, శోభనా, కాంచనా. చెల్లెల్లు. తన తరవాత సులోచన ఇంటర్ సెకండియర్‌లో వుంది. రామ్ పదో తరగతి. మిగిలినవాళ్ళంతా చిన్న క్లాసులే!

చదువుకి స్వస్తిచెప్పి, తను ఉద్యోగాన్వేషణలో పడింది. వయస్సులో వున్న ఆడపిల్ల - అందులోనూ ఆకర్షణీయంగా వున్న ఆడపిల్ల అవసరానికి

ఆదుకోమని అడిగితే చాలా మంది ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని అనుభ వించాలని చూసేవాళ్ళేకదా! తుమ్మ చెట్ల మధ్య నడుస్తూ, ముళ్ళు గుచ్చుకోకుండా చూసుకోవడం ఎంత కష్టమో, అడుగు ముందుకు వెయ్యడం, జాగ్రత్తగా మసులుకోవడం అంతే కష్టమైంది. ఎలాగో అలాగ తను చదువుకున్న స్కూల్లోనే టీచరుద్యోగాన్ని సంపాదించింది. ట్యూషన్లు చెప్పి అంతకి రెండింతలు సంపాదించేది.

ఆ రోజులు తలుచుకుంటే చాలా ఆశ్చర్యంగా అనిపిస్తయ్. తనకా ధైర్యమూ, పట్టుదలా ఎలా వచ్చాయో తెలీదు. గుండెలు మండుతున్నా నవ్వడం, కడుపులో పేగులు కరకరమంటున్నా గ్లాసుడు నీళ్ళు తాగి చకచకా నడవడం భగవంతుడు తనకిచ్చిన వరాలుగా భావించేది. జీతం రాగానే ఇంట్లోకి కావలసిన వస్తువులు కొనడం; మందులూ, మాకులూ, బట్టలూ, పుస్తకాలూ - ఇలా అవసరాలు పెరుగుతున్న కొద్దీ ట్యూషన్ల సంఖ్య ఎక్కువై, తనకి శ్రమా ఎక్కువయ్యేది. తను ఏ ఇంటికి వెళ్ళినా వారు ఆదరించేవారు! అవన్నీ చూసి, ఇందులో ఏం కష్టం వుందిలే, హాయిగా తిరుగుతోంది, ఇంట్లో చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను అనుకునేది అమ్మ. తిరగడంలో వున్న బాధ, తననితాను సంరక్షించుకోవడంలో వున్న వ్యధా ఆమె కెలా చెప్పడం?

తన ధ్యేయమల్లా సులోచన తనలాగా టీచరుకాక లెక్చరరవ్వాలి! రామ్ పెద్ద ఇంజనీరు కావాలి! లక్ష్మణ్ డాక్టరవాలి! శోభన చక్కగా మాట్లాడు తుంది. అది లాయరవ్వాలి! కాంచనకి ఆటలంటే ఇష్టం. అదొక గొప్ప క్రికెట్ ప్లేయరవ్వాలి! ఇలా ఏవేవో ఊహలు! ప్రేమతో అంకెపడిన పిచ్చి ఊహలు!! స్వార్థం అంటే తెలీని పిచ్చి ఊహలు!! ఈమాటే ఒకసారి ప్రకాశం మామయ్యతో అంటే, "మరి నీకేమీ అక్కర్లేదా?" అనడిగాడు.

"మామయ్యా! ఎలాగైనా నేను బతకగలననే నమ్మకం, ఆత్మస్థయిర్యం నాకు వున్నాయి. కానీ, నావాళ్ళందరూ పైకిరావాలి. మమ్మల్నందర్నీ చూసి అందరూ గొప్పగా చెప్పుకోవాలి. నాన్న పేరు నిలబడాలి" అంది తను ఆవేశంగా.

మామయ్య తనకేసి చూశాడు తృప్తిగా. కళ్ళు చెమ్మగిల్లాయేమో తుడుచుకున్నాడు. "గంగా! నీ ఆలోచనలు గంగానదిలా పవిత్రంగా వున్నా

యమ్మా! భగవంతుడు నీకు మేలు చేస్తాడు" అని మనసారా ఆశీర్వదించాడు. మనసు వికలమైనప్పుడు అతని మాటలు ఎడారిలో వానజల్లులా హాయి గొలిపేవి.

చూస్తుండగానే సులోచన ఎమ్.ఏ. లో కొచ్చేసింది. రామ్‌కి ఇంజనీరింగులో సీటు వొచ్చింది. తన కోరిక తీరినందుకు ఎంతో మురిసిపోయింది తను. బట్టల దుకాణానికెళ్ళి రామ్‌కీ, సులోచనకీ కావలసిన బట్టలు కొని సంతకాలు పెట్టింది. సులోచనకి ఎన్ని బట్టలున్నా సరిపోయేవి కావు. తనవీ కట్టుకుని పాడుచేసేసేది. ఎందుకలా చేస్తావని సులోచనని మందలిస్తే, "అది వెళ్ళేది కాలేజీకి, దానికి అన్ని బట్టలు అవసరమేకదా!" అనేది అమ్మ. అమ్మ మనసులో ఏమీ లేదని తనకి తెలుసు. అయినా ఆమె మాటల్లో ఏదో తనంటే తక్కువ భావం, అదంటే ఎక్కువ భావం వున్నట్టనిపించేది.

మనిషి పుట్టుక అందరిదీ ఒక్కటే అయినా, ఆ పాప పుట్టిన చోటును బట్టి సౌకర్యాలూ, హోదా కలగడం సహజం కదా! అమ్మ హృదయంలో దాని చోటు వేరనిపించేది తనకి!

రామ్‌కి సినిమాలూ, స్నేహితులూ ఎక్కువవడం చూసి మందలిస్తే, తన డబ్బు ఖర్చవుతోందని కేకలేస్తున్నాననుకునేది అమ్మ. అందుకే, "రేపొద్దున వాడి డబ్బు వాడు సంపాదించుకుంటాడులే! వాడు పెద్ద ఇంజనీరయితే నీ డబ్బు నీకు లెక్కలుకట్టి వడ్డీతోసహా ఇచ్చేస్తాడు" అని గొప్పగా నవ్వుతూ అమ్మ చెప్పినప్పుడు, మొహాన చెప్పుచ్చుకు కొట్టినట్టనిపించేది తనకి. అమ్మ ఉద్దేశ్యం వాడు సంపాదించి తన ఋణం తీర్చుకుంటాడనీ, కనుక వాణ్ణేమీ అనొద్దనీ! అంతేగానీ, తననేదో అనాలని కాదు. కానీ ఆ మాటలు తనని కువ్వలా కూల్చేసేవి. ఈ లెఖ్ఖలు, అప్పులా తను ఆశించింది వాళ్ళదగ్గరనుంచి? అదేనా తన ఆశయాలకి విలువ? అదేనా తన త్యాగానికి ప్రతిఫలం? మనసు పిచ్చిగా వికలమై పోయేది.

*   *   *

కాలం పరుగెడుతూన్నట్టనిపించింది. లక్ష్మణ్‌కి మెడిసిన్‌లో సీటొచ్చింది. శోభన బి.ఏ.లో అడుగుపెట్టింది. అంతా తనకున్నట్టే జరుగుతోంది. హిమాలయ పర్వతాలను ఎక్కినంత సంతోషం కలిగింది. అమ్మ

మొహంలోని గర్వరేఖ తనని ముగ్ధురాలిని చేసింది. ప్రకాశం మామయ్యకీ రామ్ అందకుండా పోతాడేమో, వెంటనే వసుంధరతో పెళ్ళి నిశ్చయం చేసెయ్యాలి అనే ఆదుర్దా పట్టుకుంది. కానీ తనొక అడ్డుకదా! పాపం, ఏవేవో సంబంధాలు పట్టుకొచ్చేవాడు. అవన్నీ తన ధ్యేయానికి అడ్డంకులుగానే అనిపించాయి. వారిస్తూ వచ్చింది. మామయ్యతో పాటు వసుంధరా వచ్చేది. ఆ అమ్మాయికి తానొక ఇంజనీరు భార్యననే గర్వం అడుగడుగునా కనిపించేది. ఇంజనీరుకి తల్లి, ఇంజనీరు కావడానికి కారకురాలైన ఆక్కా ఆ అమ్మాయి దృష్టికి సరిగ్గా ఆనడంలేదు. ఇవన్నీ మామూలే అని సరిపెట్టుకునేది తను.

సరిగ్గా ఆ సమయంలో తటస్థపడ్డాడు మల్లిక్. తన స్నేహితురాలు శ్రీదేవి పెళ్ళి కెళ్ళినప్పుడు జరిగింది మల్లిక్‌తో పరిచయం. మెల్లగా స్నేహంగా మారింది. క్రమేణా ప్రేమగా చిగురించింది. మల్లిక్‌కి అద్దం లాంటి మనసుంది. అందులో పడ్డది తన బొమ్మ అని తెలిశాక, వెంటనే పెళ్ళికి ఒప్పుకుని, శోభనని చదువు మాన్పించి, ఉద్యోగంలో చేర్పించింది, తను పనిచేస్తున్న స్కూల్లోనే!

"అక్కా! మరి నేను లాయరవ్వొద్దా?" అని శోభన అడిగినప్పుడు. తనెంత కుమిలిపోయిందో చెప్పడానికి మాటలు సరిపోతాయా? "శోభనా! నాకిప్పుడు పెళ్ళి కాకపోతే మీకెవ్వరికీ కాదు. విద్య నేర్చుకోవడానికి వయస్సు లేదు. ఎప్పుడయినా నేర్చుకోవచ్చు. కానీ వివాహానికి వయస్సు వుందమ్మా! ఎదిగిన ఆడపిల్ల పెళ్ళికాక ఇంట్లో వుంచే సమస్యలు కష్టమవుతాయి. అందుకనే నేనీ నిర్ణయానికొచ్చాను. పైగా మల్లిక్ చాలా మంచివాడు. చూడు శోభా! సులోచనకి ఈ సంవత్సరంతో చదువైపోతుంది. దానికి ఉద్యోగం వస్తుంది. మళ్ళీ సంవత్సరం నువ్వు కాలేజీలో చేరు. ఇంటి బాధ్యత అది చూసుకుంటుంది" అన్నది. శోభన సంతోషంగా ఒప్పుకుంది. మల్లిక్‌తో తన వివాహం నిరాటంకంగా జరిగిపోయింది.

మల్లిక్ నిజంగా మహానుభావుడు. ఏనాడూ పల్లెత్తుమాట అనలేదు సరి కదా, తన స్వేచ్ఛకి అడ్డుచెప్పలేదు. హనీమూన్‌కి వెళ్ళినా, సినిమాలో కూర్చున్నా ఇంటి సంగతులే మాట్లాడేది తను. పండగొచ్చినా పబ్బమొచ్చినా

యధాశక్తి ఏదో ఒకటి అందరికీ తీసికెళ్ళి ఎంతో ఆనందాన్ని పొందేది. చిన్నతనంలో బాధ్యతలు వహించడంవల్లేమో ఈ ఆత్మీయత బలంగా నాటుకుపోయింది మనసులో. తన ప్రమేయం ఒక్కోసారి వారికి యిష్టం వుండేది కాదు. తనేమనుకుంటుందోనన్న భయంతో ఊరుకునేవారు. అది తెలిసి చాలా బాధపడేది తను. "తనదగ్గర భయమేమిటి? భక్తుండాలి. ప్రేముండాలి!" ఇలా పిచ్చి పిచ్చి ఆలోచనలు!

మరికొన్నాళ్ళకే రామ్ ఇంజనీరింగ్ పూర్తవడం, వసుంధరతో పెళ్ళి అవడం జరిగింది. తన స్నేహితురాలి భర్త రామ్‌ని ఫారిన్ పంపించడానికి కూడా ఏర్పాట్లు చేశాడు. రామ్ రెండు సంవత్సరాలు షికాగోలో చదివి వచ్చాడు. వెళ్ళింది రామే అయినా, చదివి తన కృషితో ప్యాసయిందీ రామే అయినా, తన స్నేహితురాలి భర్త ద్వారా తను సూత్రధారి కావడం తనకు గర్వంగానే అనిపించింది. బహుశః అది వసుంధరకీ, రానురాను రామ్‌కీ కూడా బాధ కలిగించి వుంటుంది.

సులోచనకి చదువు పూర్తయిన వెంటనే బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. శోభనని కాలేజీలో చేరమని చెప్పింది తను. డబ్బు సంపాదన రుచి తెలిసిందేమో, కాలేజీలో చేరనంది. మందలించడం, కేకలెయ్యడం. ఫలితం తనే చీవాట్లూ, చీదరింపులూ పడడం జరిగింది.

కాలగర్భంలో మరో మూడేళ్ళు యిట్టే గడిచాయి. తనిప్పుడు ఆదిత్యకీ అపురూపకీ తల్లయింది. లక్ష్మణ్ మెడిసిన్ పూర్తవడం, తన క్లాస్‌మేట్ మేనకతో పెళ్ళిజరగడం ఇంచుమించు ఒక్కసారి జరిగాయి. మేనకా లక్ష్మణ్‌లు ఇద్దరూ డాక్టర్లే కావడంచేత హాస్పిటల్‌కీ, ప్రాక్టీసుకీ వెళ్ళిపోయేవారు. ఎవ్వరితోనూ ఎక్కువగా కలిసేవారుకాదు. ఇది చూసి వసుంధరా దూరదూరంగా ఉండటానికి ప్రయత్నించేది కానీ, ఎంత పెద్దా మామయ్య కూతురు కదా, మరీ బాగుండదని మాట్లాడేది. సులోచన తన కొలీగ్ రమేశ్‌ని పెళ్ళి చేసుకుంది. వర్ణాంతర వివాహానికి వాళ్ళింట్లో ఒప్పుకోకపోవడంతో రిజిష్టరు పెళ్ళి చేసుకుని, ఫ్రెండ్స్‌ని పార్టీకి పిలిచారు వాళ్ళు. పెళ్ళవగానే వాళ్ళు ముందే చూసి పెట్టుకున్న ఇంటికి వెళ్ళిపోయారు లక్ష్మణ్, మేనకా ఇరాన్‌కి వెళ్ళిపోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

కాంచనని క్రికెట్ క్లబ్బులో చేరమంది తను. "చస్తే చేర"నంది రూఢిగా. "శోభన ఎలాగూ లాయరు కాలేదు. పోనీ నువ్వైనా చదువు" అన్నందుకు విరుచుకుపడింది తనమీదికి! "నాకు ఇంటరెస్టు లేదని చెప్పినా ఎందుకు నా ప్రాణం తీస్తావ్?" అంది కసురుకుంటూ. అది కసురుకున్న విధానం తన ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టింది. "నీకోసం చెప్పినా ఎందుకలా విరుచుకు పడతావ్?"

"నాకోసం నువ్వేం చెయ్యఖ్ఖర్లేదు. నేను డ్యాన్సు నేర్చుకుందామను కుంటున్నాను."

అదలా మాట్లాడుతున్నకొద్దీ తనలో ఉక్రోషం పొంగుకొచ్చింది. "పెద్దా చిన్నా లేకుండా ఎదిరిస్తావా?'' అంటూ చెంపమీద కొట్టింది తను.

అంతే! అమ్మ కేకలు పెంకులెగిరిపోతాయనిపించింది.

తనకి తెలుసు తను తప్పు చేసిందని. కానీ అది మాట్లాడిన విధానమూ తప్పేగా!

ఇదంతా గుర్తుకొచ్చేసరికి కళ్ళు నీటికుండలయ్యాయి!

అటుకేసొచ్చిన సుగుణమ్మ గంగనిచూసి "లేచిరామ్మా, భోంచేద్దాం'' అంది.

"నాకాకలిగా లేదత్తయ్యా!"

"చూడు గంగా! అతిగా ప్రేమించడం, అతిగా ద్వేషించడం, అతిగా ఆలోచించడం అన్నీ తప్పులే! బుర్ర పిచ్చెక్కిపోతుంది. లేచిరా, పిచ్చిపిల్లా!'' అంటూ వడ్డించడానికి వెళ్ళిపోయింది.

కలత నిండిన మనసు కన్నీటితో ప్రశ్నించింది గంగని:

అభిమానించడం పిచ్చా?

సలహా చెప్పడం పిచ్చా?

బాగుండాలని బోధించడం పిచ్చా?

మంచితనం పిచ్చా?

ప్రేమించడం పిచ్చా?

ప్రేమించాలనుకోవడం పిచ్చా?

"నీకెందుకు మా విషయాలు?'' అని సులోచనా, శోభనా అన్నప్పుడు హృదయం తనొక పరాయిదానిలాగా ఆలోచిస్తే ముక్కలయిపోయింది.

"గంగా! నువ్వేమీ సలహాలివ్వకే" అని రామ్, లక్ష్మణులన్నప్పుడు మనసు కుతకుతలాడిపోయింది.

"పిచ్చివారు కాకపోతే మీ గొడవలు మీరు చూసుకోకూడదూ?'' అని వసుంధరా, మేనకా అన్నప్పుడు, కాళ్ళకింద భూమి బద్దలయినట్లనిపించింది.

కాంచన ఎదురుతిరుగుతున్నప్పుడు, వెయ్యి తూటాలు గుండెలో దూసుకుపోయినట్టనిపించింది. కొరడాతో ఛెళ్ళున వీపుమీద కొట్టినట్టనిపించింది.

సుగుణమ్మ మళ్ళీ లోపలినుంచి కేకపెట్టింది: "మల్లిక్! నువ్వూ గంగా రండి భోజనానికి'' అని. యాంత్రికంగా వెళ్ళి భోంచేస్తున్నా, మళ్ళీమళ్ళీ ఇదే ఆలోచన. స్నేహితులని చూసినా ఇవే మాటలు. స్కూల్లో టీచర్లమధ్య ఇదే సంభాషణ. చివరకి స్టూడెంట్లు కనిపించినా ఇదే ధోరణి. ఇంట్లోవాళ్ళు వినీవినీ విసుక్కున్నారు. బయటవాళ్ళు చీదరించుకున్నారు. స్టూడెంట్లు నవ్వుకున్నారు. మొత్తానికి అందరూ 'పిచ్చిది పాపం' అన్నారు. "పిచ్చివాళ్ళు, వాళ్ళకర్థంకాదు" అనుకుంటుంది గంగ!

*